క్లుప్తంగా

బాలగణపతి ఆలయంలో ఒకటో తేదీ వరకు ఉత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ బాలగణపతి సేవా సమితి ఆధ్వర్యంలో గణపతి మహోత్సవాలు ఈ నెల 18 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి లక్ష్మీవెంకటకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గణపతి మహోత్సవాలు పరిస్కరించుకుని ఈ నెల 18వ తేదీన రాత్రి ఏడు గంటలకు శ్రీ కుబేర గణపతి అలంకరణలో స్వామివారి భక్తులకు దర్శనమిస్తారన్నారు. శ్రీ కుబేర గణపతిని కోటి రూపాయలు విలువ గల బంగారు ఆభరణాలతో ప్రత్యేక అలంకరణ చేస్తామన్నారు. తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకారాల్లో స్వామి వారు దర్శనమిస్తారని చెప్పారు.

వివాహితకు వేధింపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత వెంట పడి వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ ఉప్పలపాటి రామచంద్రరావు వీధికి చెందిన బత్తుల మాధవి, ప్రసాద్ భార్యభర్తలు. మాధవి జ్యూయలరీ షాపులో పని చేస్తుండగా, ప్రసాద్ వంట పని చేస్తుంటాడు. మాధవికి ఏడాదిగా వీరబాబు అనే యువకుడు పరిచయం అయ్యాడు. వీరబాబు మాధవిని అక్కా అని పిలిచే వాడు. వీరబాబు తనకు పరిచయం ఉన్న శాంతి అనే మహిళను ప్రేమించారు. కొద్ది రోజుల కిందట వీరబాబుకు శాంతికి గొడవ జరగడంతో దూరంగా ఉంటున్నారు. అప్పటి నుంచి వీరబాబు మాధవి వెంట పడి వేధింపులకు గురి చేయసాగాడు. తనతో మాట్లాడకపోతే చనిపోతానని, బ్లేడ్‌తో కోసుకుంటానని బెదిరింపులకు పాల్పడటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్వీ రావుకు సత్కారం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రైతుల అంశంపై పీహెచ్‌డీ చేసిన బీసీ ఇంటర్నేషనల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఎన్వీ.రావును శనివారం బీసీ నేతలు సత్కరించారు. కేఎల్‌రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేదారేశ్వరరావు, టి.కృష్ణాంజనేయులు, ఈవీఎస్ రామకృష్ణారావు, నారాయణరావు, రామారావు ఎన్వీ.రావును సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

నగరాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట

- రూ. 48.20 లక్షలతో తాగునీటి పైప్ లైన్ పనులు
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి


49వ డివిజన్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

విచిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో నగరాభివృద్ధికి పెద్ద పీట వేశామని మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 49వ డివిజన్‌లో నూతన తాగునీటి పైప్ లైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్‌తో కలిసి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు.

టీడీపీ హయాంలో అభివృద్ధి జరుగలేదు..

ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో చంద్రబాబు నిర్లక్ష్య వైఖరితో నగరంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే వందల కోట్లు వెచ్చించి నగరాభివృద్ధికి కృషిచేశారని అన్నారు. మధ్యలో వదిలేసిన ఫ్లై ఓవర్ నిర్మాణాలు, పార్కులు, కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, వాటర్ ట్యాంక్ నిర్మాణాలు వంటి అనేక పనులు పూర్తి చేశామని తెలిపారు. అదే విధంగా నగరంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా తక్షణమే వాటి పరిష్కారానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే 49వ డివిజన్‌లో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన తాగునీటి పైపు లైన్‌లు దెబ్బతినటంతో వాటిని తొలగించి కొత్త పైపు లైన్ నిర్మాణానికి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.48.20 లక్షలు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే స్థానికులు ఎదుర్కుంటున్న తాగునీటి ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో 49వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గొడుపేరు సుధీర్, నాయకులు చేపురి శ్రీను, దాసి జయప్రకాష్ కేనడి, బడిగు అప్పారావు, హేమంత్, బాజీ, వెంకన్న, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా చవితి వేడుకలు జరుపుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రజలందరూ వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. తెనాలి డబుల్ హార్స్ సంస్థ సీడ్ గణపతి విగ్రహాలను నగరంలో పంపిణీ చేశారు. అందులో భాగంగా ఎమ్మెల్యే వెలంపల్లిని ఆ సంస్థ ప్రతినిధులు ఆయన కార్యాలయంలో కలిసి సీడ్ గణపతి ప్రతిమను అందించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ గణపతి మట్టి విగ్రహాల్లో వివిధ రకాల విత్తనాలను ఉంచి వాటిని ప్రజలకు అందించటం అభినందనీయమన్నారు. పూజ అనంతరం విత్తనాలు ఉంచిన స్వామి వారి ప్రతిమలను కుండీలలో ఉంచటం ద్వారా పర్యావరణానికి ఇబ్బందులు లేకుండా మొక్కలు సైతం వస్తాయని చెప్పారు.


సీడ్ గణపతిని వెలంపల్లికి అందిస్తున్న తెనాలి డబుల్ హార్స్ ప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణకు అండగా ఉండాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణకు అందరూ అండగా ఉండాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అధ్యక్ష, కార్యదర్శులు చలవాది మల్లికార్జునరావు, పి.లక్ష్మణస్వామి అన్నారు. ఓజోన్ పరిరక్షణా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ కళాశాల రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ, మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని ఆ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణానికి అపకారం చేసే కార్యక్రమాలకు అందరూ దూరంగా ఉండాలన్నారు. వినాయకచవితి పర్వదినాన్ని పర్యావరణ హితంగా అందరూ జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీరాం రాధాకృష్ణమూర్తి, కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.


మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న లక్ష్మణస్వామి

కాలుష్యాన్ని అరికట్టడం అందరి బాధ్యత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాలుష్యాన్ని అరికట్టడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకుడు డాక్టర్ దీప్‌రాజ్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల రసాయనశాస్త్రం, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఓజోన్ పరిరక్షణా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'వాయు కాలుష్యంతో గ్లోబల్ వార్మింగ్, ఓజోన్ పొరకు ప్రమాదం జరిగే అవకాశాలు' అంశంపై సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ దీప్‌రాజ్ మాట్లాడుతూ.. గాలి, నీరు, మట్టి వంటి పదార్థాల నాణ్యతను తగ్గించే కారకాలను కాలుష్యంగా సాధారణ పరిభాషలో సంబోదిస్తామన్నారు. మానవులు తమ విలాస జీవితాల కోసం కాలుష్యానికి కారకులవుతున్నారని చెప్పారు. సమాజాన్ని చైతన్యవంతం చేయటానికి పాటుపడాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ కాలుష్యానికి కారకులు కాకుండా విద్యార్థులు తమ జీవన విధానాన్ని కొనసాగించాలన్నారు.

సీడ్ గణపతి విగ్రహాల పంపిణీ

తులసీ విత్తనాలను ఉంచి తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలను కళాశాలలో విద్యార్థులకు, సిబ్బందికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు పంపిణీ చేశారు. గణపతి విగ్రహాలను పూజ చేసిన తరువాత మట్టి కుండీలో నిమజ్జనం చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ జి.కృష్ణవేణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ వీఎస్ రావు, డి.పవన్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విత్తన గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న దీపరాజ్, ప్రిన్సిపాల్ నారాయణరావు తదితరులు

డీఎస్ఎంసీ హైస్కూల్‌లో కన్స్యూమర్ క్లబ్ ఏర్పాటు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న హెచ్ఎం కోటయ్య, ఉపాధ్యాయుడు దుర్గారావు, క్లబ్ ప్రతినిధులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్(డీఎస్ఎంసీ) హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులతో కన్స్యూమర్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాతంగి కోటయ్య మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కుల గురించి విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాలన్న ఉద్దేశంతో ఈ క్లబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. వస్తువుల కొనుగోలు విషయంలో ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల మోసాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండే విధంగా ఈ క్లబ్ ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు. కన్స్యూమర్ క్లబ్‌లో తెలుసుకున్న విషయాలపై తోటి విద్యార్థులతో చర్చించడంతో పాటు ఇంట్లో పెద్ద వారికి అవగాహన కల్పించాలన్నారు. వినియోగదారుల హక్కులకు సంబంధించి ఉన్న చట్టాలు, సంఘాలు, న్యాయస్థానం గురించి తెలుసుకోవాలని సూచించారు. క్లబ్ ప్రతినిధులు(విద్యార్థులు) కె.సుమంత్, పి.పావని దుర్గ, ఎస్‌కెఏ రియాన్, జి.సందీప్, పి.హన్విత, వి.నాగ సాయిరామ్, ఆర్.శ్యామ్ సుష్మ, వి.జయశ్రీ సహచర విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులు – బాధ్యతలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కేరింత.. తుళ్లింత

యువ ఫేషియల్ సర్జన్ల సందడి


నృత్యాలు చేస్తున్న యువ ఫేషియల్ సర్జన్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతూ, కత్తెర్లు చేతపట్టి శస్త్రచికిత్సలు నిర్వహించే మాక్సిల్లో ఫేషియల్ యువ సర్జన్లు ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. అసోసియేషన్ ఆఫ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ చాప్టర్ 15వ సమావేశాలు శుక్ర, శనివారం నిర్వహించారు. ఈ సమావేశాల్లో భాగంగా లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో యువ వైద్యులు నృత్యాలు చేసి సందడి చేశారు. ఆద్యంతం ఉత్సాహభరితంగా జరిగిన కార్యక్రమంలో 200ల మందికిపైగా మాక్సిల్లో ఫేషియల్ సర్జన్లు పాల్గొన్నారు.

ముగిసిన సదస్సు

రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సదస్సును డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె.బాబ్జి ప్రారంభించగా, ఏషియన్ అసోసియేషన్ ఆఫ్ ఓరల్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ గుణశీలన్ రాజన్ పాల్గొన్నారు. ఈ సదస్సులో డాక్టర్ ఎస్.కోటేశ్వరరావు, డాక్టర్ మెహబూబ్ షేక్, డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కె.బాబ్జి ఆవిష్కరించారు. ఆధునిక ముఖ, దవడ శస్త్ర చికిత్సలపై విశ్లేషణలు, చర్చా కార్యక్రమాలు జరిగాయి.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన


రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మాధురి లావణ్య, కృష్ణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): జోజినగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మట్టి రోడ్డుగా ఉన్న ఈ రహదారిగుండా రాకపోకలు సాగించటం కష్టంగా ఉండటంతో స్థానికులు సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే సమస్యను స్థానిక శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి రూ.9,80,000ల నిధులు మంజూరు చేయించారన్నారు. దీంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించామని తెలిపారు. డివిజన్‌లో ప్రాధాన్యతా క్రమంలో అన్ని రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. అదే విధంగా డివిజన్ పరిధిలోని కొండ ప్రాంతంలో రోడ్లు, సైడు కాలువలు, మెట్లు నిర్మాణంతో పాటు వీధి లైట్లను ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వం డివిజన్ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని, సీఎం జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పలు అభివృద్ధి పనులతో ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ బాధ్యులు మైలవరపు కృష్ణ, నాయకులు ముత్తా వాసు, బైపినేని కోటేశ్వరరావు, డి.రాము పాల్గొన్నారు.

చీరల విక్రయం ద్వారా రూ.41,580 ఆదాయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరల విక్రయం ద్వారా దేవస్థానానికి రూ.41,580ల ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. దేవస్థాన ఆవరణలో శుక్ర, శనివారాలు రెండు రోజులుగా చీరల బహిరంగ వేలం నిర్వహించారు. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు నిర్వహించిన వేలం ప్రక్రియను కొత్తపేట సుబ్రహ్మణ్యస్వామి వారి దేవస్థాన ఈవో ఎస్వీ.సుబ్బారావు పర్యవేక్షించారు. చీరల వేలంలో మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన కార్యదర్శి లింగిపిల్లి అప్పారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు నరసింహారావు, పణుకు రమా, పిళ్లా విజయ్, మజ్జి శ్రీనివాసరావు, గూడెల రామకృష్ణ పాల్గొన్నారు.

రైల్వే క్యాటరింగ్ స్టాల్స్‌లో ఆకస్మిక తనిఖీలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు ఆధ్వర్యంలో వాణిజ్య విభాగం అధికారులు విజయవాడ స్టేషన్‌లోని అన్ని క్యాటరింగ్ స్టాల్స్‌ను శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎటువంటి అనుమతులు లేని 26 మంది విక్రేతలను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.59,800 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని ముగ్గురు విక్రేతలను ఆర్పీఎఫ్ పోలీసులకు అప్పగించారు. రైల్వే స్టేషన్‌లో అధిక ధరలు వసూలు చేయకుండా నిర్దేశించిన పరిమితులకు అనుగుణంగా విక్రయాలు సాగించాని, ముఖ్యంగా రద్దీ సమయంలో ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం కలగకుండా ప్లాట్‌ఫామ్‌లపై ఆక్రమణలు ఆపాలని సీనియర్ డీసీఎం రాంబాబు స్టాల్స్ నిర్వాహకులు, వెండర్స్‌కు సూచించారు.

చిరుధాన్యాలతో తల్లీబిడ్డలకు ఆరోగ్యం


బాలింతలకు సూచనలిస్తున్న కార్పొరేటర్ ఆదిలక్ష్మి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిరుధాన్యాలను వివిధ రూపాల్లో తీసుకోవడం వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సెక్టార్-2 ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు మంచి పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డలకు మంచి ఆహారం ఇవ్వడం వల్ల వారు ఎంతో ఆరోగ్యంగా, రోగ నిరోధక శక్తితో ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఇన్‌చార్జి సూపర్‌వైజర్ బి.లక్ష్మి, ఎంఎస్‌కే దునీషా, కార్యకర్తలు పి.వరలక్ష్మి, కె.దేవి, జే దుర్గాంబ, పి.లక్ష్మి, పి.తులసీ పాల్గొన్నారు.

రేపటి నుంచి హోల్‌సేల్ కాంప్లెక్స్‌లో చవితి ఉత్సవాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి మహేంద్రనగర్‌లోని మహాత్మాగాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి వినాయక చవితి మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు తెలిపారు. కాంప్లెక్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన విజయవాడ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ మెంబర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి నాగేశ్వరరావు, కాసుల వెంకట నారాయణ, కోశాధికారి నంబూరు సాంబశివరావులతో కలిసి మాట్లాడారు. కాంప్లెక్స్‌లో తొలిసారిగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 10.36 గంటలకు కాంప్లెక్స్‌లో వేంచేసి ఉన్న శ్రీసిద్ధి, బుద్ధి సమేత దశభుజ మహాగణపతి దేవాలయంలో చవితి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజు విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. చివరి రోజైన 23వ తేదీ శనివారం ఉదయం లక్ష్మీ గణపతి హోమం, ఉద్వాసన, సాయంత్రం 4 గంటలకు స్వామివారి లడ్డూ వేలంపాట అనంతరం మేళతాళాలు, కోలాట నృత్యాలతో నిమజ్జన ఊరేగింపు ఉంటాయని వివరించారు. సమావేశంలో శ్రీగణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, సొసైటీ పాలకవర్గ సభ్యులు, దేవాలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు.

నేడు మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయవాడలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మట్టి వినాయక ప్రతిమల పంపిణీ జరుగుతుందని శబరిమల అయ్యప్ప సేవా సమాజం కోశాధికారి అవ్వారు బుల్లాబ్బాయ్ తెలిపారు. శబరిమల అయ్యప్ప సేవా సమాజం, శ్రీ గణేష్ ఉత్సవ సమితి విజయవాడ మహానగర్ సంయుక్త ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ చేస్తామన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు నియోజకవర్గంలోని కేఎల్ రావు నగర్ ఫైర్ స్టేషన్ వద్ద అవ్వారు బుల్లాబ్బాయి ఆధ్వర్యంలో, కొత్తపేట వాగు సెంటర్, నెహ్రూబొమ్మ సెంటర్‌లో కిరణ్ స్వామి వారి ఆధ్వర్యంలో విగ్రహాల పంపిణీ జరుగుతుందన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

సాక్షి, అమరావతి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాల్లో ముందుకు సాగాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. విజయవాడ బాలోత్సవ భవనంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సదస్సులో శ్రీనివాసరావు మాట్లాడుతూ నిజాం నవాబు పాలనలో ప్రజలు తీవ్ర నిర్బంధాలను ఎదుర్కొన్నారన్నారు. రజాకార్లు, దేశ్‌ముఖ్‌లు, జమీందార్లు, దొరలు గ్రామాలపై పడి నానా అరాచకాలు సృష్టించారని చెప్పారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో 1946–51 మధ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందన్నారు. ఈ పోరాటంలో వేలాది మంది ప్రాణాలను కోల్పోయారన్నారు.